ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల
జిల్లా వార్తలు

5★★

మంగళవారం 10 డిసెంబరు 2024

కాసేపు
ఫోన్‌కు దూరంగా..
- ఇండోర్ గేమ్స్ ఆడుతూ..
- చిన్నారులు, యువత ఆట, పాటలతో ఉత్సాహం 6లో

సీఎం కప్ 2024ను
పకడ్బందీగా
నిర్వహించాలి
అదనపు కలెక్టర్ 8లో



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థి

రాయికల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటిక్యాల ఉన్నత పాఠశాలకు చెందిన బేతి రశ్మిత ఇన్‌స్పైర్ మానక్ 2023-24 అవార్డుల జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం సదాశివ్ సోమవారం తెలిపారు. రశ్మితను పాఠశాలలో సన్మానించారు.

క్రమబద్ధీకరణ ఎన్నడో..?

- దశాబ్ద కాలంగా పని చేస్తున్నా పట్టింపు కరువు
- సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులకు తప్పని ఇబ్బందులు ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామంటూ ఆవేదన
- నేటి నుంచి సమ్మె బాటలో సిబ్బంది

జగిత్యాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చాలీచాలని వేతనాలతో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ సర్వీసు క్రమబద్ధీకరణ కోసం ఆందోళన బాట పడుతున్నారు. ఏళ్ల తరబడి సమగ్ర శిక్ష విభాగంలో చాలీచాలని వేతనాలకు పనిచేస్తున్న తమ సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు.

సమగ్ర శిక్ష పథకం కింద విద్యార్థులకు, ఉపాధ్యాయులకు విశిష్టమైన సేవలందిస్తూ విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ సర్వీసులను క్రమబద్ధీకరణ చేయాలని లేదంటే పే స్కేల్ వర్తింప చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్ల సాధనకు సమగ్ర శిక్ష ఉద్యోగులు జేఏసీగా ఏర్పడి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొని రావడానికి పలు కార్యక్రమాలను నిర్వహించడానికి సన్నద్ధం అవుతున్నారు. ఈనెల 10వ తేదీ నుంచి సమ్మెకు దిగేందుకు నిర్ణయించుకున్నారు.



జగిత్యాల కలెక్టర్ కార్యాలయ ఏఓ హన్మంత్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న ఉద్యోగులు

వివిధ స్థాయిలో ఇలా..

విద్యా శాఖలోని సమగ్ర శిక్షా విభాగంలో వివిధ స్థాయిలో పలువురు ఉద్యోగులు కాంట్రాక్టు విధానం పై పని చేసున్నారు. జిల్లా స్థాయిలో ఏపీవోలు, సిస్టం అనాలిస్టు, టెక్నికల్ పర్సన్‌లు, ఆపరేటర్లు, డీఎల్ఎంటీ, మెసెంబర్లు విధులు నిర్వహిస్తున్నారు.

(తరువాయి 8వ పేజీలో)

జిల్లా వ్యాప్తంగా ఉద్యోగుల సంఖ్య..

జిల్లా వ్యాప్తంగా సమగ్ర శిక్ష పథకంలో 544 మంది కాంట్రాక్టు ఉద్యోగులు వివిధ విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో కేజీబీవీల్లో బోధన, బోధనేతర విధుల్లో 329 మంది, జిల్లా విద్యాధికారి కార్యాలయంలోని సమగ్ర శిక్ష ప్రాజెక్టు విభాగంలో టెక్నికల్ పర్సన్‌లుగా ఆరుగురు, పీటీఐగా 59 మంది, కేర్ టేకర్లుగా 4 మంది, సీసీవోలుగా పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు 18 మంది, ఎంఐసీ కో ఆర్డినేటర్లుగా 16 మంది, భవిత కేంద్రాల్లో దివ్యాంగ పిల్లలకు బోధన విధులు నిర్వహిస్తున్న ఐఈఆర్‌పీలు 28 మంది, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్‌పీ)లుగా 69 మంది మెస్సెంజర్లుగా 15 మంది పనిచేస్తున్నారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలను అందజేశారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో సమ్మె చేపట్టాలని నిర్ణయించారు.

రాష్ట్రంలో సీఎం రేవంత్ దుర్మార్గ పాలన

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

జగిత్యాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దుర్మార్గ పాలన కొనసాగుతుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆరోపించారు. సోమవారం పట్టణంలోని ఎస్సారెస్పీ క్యాంపులో గల బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో గల తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పు చేయడం సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో రానున్న కాలంలో బీఆర్ఎస్‌దేనని, తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎప్పటి మాదిరిగానే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయిస్తామన్నారు. చేతులెత్తి నమస్కారం పెట్టే తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్పు చేసి, చేతు ఎత్తే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం దుర్మార్గమైన పని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వప్రయోజనాల కోసం ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, బీఆర్ ఎస్ పట్టణాధ్యక్షుడు గట్టు సతీష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న విద్యాసాగర్‌రావు, దావ వసంత

ప్రజావాణి సమస్యలు

సత్వరమే పరిష్కరించాలి..

జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత





దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత, రేషన్ డీలర్ కోసం దరఖాస్తు చేసుకున్న మహిళలు

జగిత్యాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి వారు హాజరై జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 25 దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించి నివేదిక అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల ఆర్డీవోలు మధు సూదన్, జివాకర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో హన్మంతరావు, డీఆర్డీవో రఘువరన్‌లతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

● రుణ మాఫీ అందలేదంటూ..

ప్రభుత్వం నిర్వహించిన రుణ మాఫీ తమకు అందలేదంటూ జగిత్యాల రూరల్‌మండలం మోరపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు కలెక్టరేట్‌కు తరలివచ్చి దరఖాస్తులు అందజేశారు. రూ. రెండు లక్షల లోపు రుణాలున్నప్పటికీ మాఫీ కాలేదంటూ గోడు వెల్లబోసుకున్నారు. రెండు లక్షల వరకు రుణ మాఫీ చేస్తామనడంతో రూ. రెండు లక్షలకు పైగా ఉన్న బకాయిలను చెల్లించామని ఆవేదన వ్యక్తం చేశారు.

● రేషన్ డీలర్ షిప్ మహిళా సంఘానికి అప్పగించాలి

మల్లాపూర్ మండలం రేగుంట గ్రామంలో ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన రేషన్ డీలరు షిప్ స్వశక్తి మహిళా సంఘాలకు కేటాయించాలని కోరుతూ పలువురు మహిళలు జగిత్యాల ప్రజావాణికి వచ్చారు. గ్రామానికి చెందిన బొల్లారపు లక్ష్మీ పేరిట రేషన్ డీలర్ షిప్ రాగా, కొందరు రాజకీయ నాయకుల జోక్యం వల్ల ఎటువంటి సమాచారం లేకుండా రేషన్ దుకాణ నిర్వహణను ఇతరులకు అప్పగించారని వాపోయారు.

● దివ్యాంగురాలిని.. ఉపాధి చూపండి

ఉపాధి కోసం ఏళ్ల తరబడి ప్రభుత్వ కార్యాలయ చుట్టూ తిరుగుతున్నా. రుణం కావాలని ఎన్ని సార్లు విన్నవించుకున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదు అంటూ మెట్‌పల్లికి చెందిన దివ్యాంగురాలు... ప్రజావాణిలో అధికా రులను కలిసి వినతిపత్రం సమర్పించింది.



రుణం కోసం దరఖాస్తు చేసుకున్న దివ్యాంగురాలు

రమేశ్‌బాబు పౌరసత్వం తీర్పుపై కాంగ్రెస్ సంబరాలు

కథలాపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ మాజీ ఎమ్మెల్యే రమేశ్‌బాబు పౌరస త్వం విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పు పట్ల సోమ వారం కథలాపూర్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యే పౌరసత్వాన్ని సవాలు చేస్తూ పదేళ్ల కోర్టులో చేసిన పోరాటం ఫలించిందన్నారు. ఆది శ్రీనివాస్ మొదటి నుంచీ రమేశ్‌బాబు జర్మనీ పౌరుడేనని వాదిస్తూ వచ్చారని ఎట్టకేలకు న్యాయం గెలిచిందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. వేములవాడ - కోరుట్ల రహదారిపై టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు కాయితి నాగరాజు, ఎండీ అజీం, పూండ్ర నారాయణరెడ్డి, చెదలు సత్యనారాయణ, వాకిటి రాజరెడ్డి, లింగారావు, అల్లకొండ లింగంగౌడ్, ఎగ్యారపు శ్రీహరి, సుదర్శన్ ఉన్నారు.



టపాసులు కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సమ్మె నోటీస్

పెగడపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 10వ తేది నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు పేర్కొంటూ సోమవారం మండల విద్యాధికారి సులోచనకు సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు జుంజురు రాజమల్లు, మల్లేశ్, ప్రసాద్, ప్రదీప్, చంద్రమౌళి, సంతోష, సుజాత, వసంత, శంకర్, అనూరాద, మల్లేశం, శ్రీలీల పాల్గొన్నారు.

వెల్గటూర్: విద్యాశాఖ అనుబంధమైన సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న వెల్గటూర్ మండల పరిధిలోని సిబ్బంది మండల విద్యాధికారి బోనగిరి ప్రభాకర్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నందయ్యలకు సమ్మె నోటీసు అందించారు. సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

బుగ్గారం: సమగ్ర శిక్ష రాష్ట్ర ఐకాస నిర్ణయం మేరకు సమ్మె చేపడుతున్నట్లు సమగ్ర శిక్ష ఉద్యోగులు తెలిపారు. సోమవారం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మోహన్‌రెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శిగా శివరామకృష్ణ



కోరుట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్టేట్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా కోరుట్లకు చెందిన పాలెపు శివరామకృష్ణ నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి సో మవారం ప్రకటించారు. హైదరాబాదులో జరిగిన యూనియన్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి, ప్రధాన కార్యదర్శి సదానందగౌడ్‌లు ప్రకటించి నియామక పత్రం అందించినట్లు యూనియన్ సభ్యులు తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి, ప్రధాన కార్యదర్శి సదానంద గౌడ్, జిల్లా అధ్యక్షుడు మచ్చ శంకర్, జిల్లా కార్యదర్శి భైరం హరి కిరణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగారపు రవి, రాష్ట్ర కార్యదర్శి సీరంచ రవీందర్, మాజీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాజోజీ భూమయ్య, జిల్లా ఆర్థిక కార్యదర్శి బండి శ్రీనివాస్‌లకు శివరామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ నాయకులు సాయికుమార్, నల్ల రాజ్ కిరణ్, రాజశేఖర్, రావూఫ్, పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక


విద్యార్థికి ప్రశంస పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోమటికొండపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 6వతరగతి చదువుతున్న తెడ్డు నశ్విత రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈనెల 6,7 తేదీల్లో జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనలో వనరుల నిర్వహణ విభాగంలో ప్రొటెక్షన్ ఆఫ్‌రెయిన్ వాటర్ ప్రాజెక్ట్‌లో జిల్లాస్థాయి ప్రథమ బహుమతి సాధించినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైనందున జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జిల్లా విద్యాధికారి రాము ప్రశంస పత్రం అందజేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రాధిక, ఉపాధ్యాయులు జ్యోష్న, సుధరాణి, విశాల్, రాణిలో పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో నేటి నుంచి గీతాజయంతి మహోత్సవం

వేములవాడ కల్చరల్, డిసెంబ రు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి మూడు రోజులపాటు గీతాజయంతి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల సందర్భంగా 10వ తేదీ మంగళవారం నుంచి 12వతేదీ గురువారం వరకు ఉదయం 7.30 గంటల నుంచి స్వామివారి నాగిరెడ్డి మండపంలో మహాన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకం, అర్చనలు, గీతాహోమం, గీతా ప్రవచనములు నిర్వహించనున్నారు. రాజన్న అనబంధ ఆలయాల్లో అర్చనలు, సాయంత్రం 4గంటల నుంచి శ్రీమద్భాగవతము దశామస్కంద పురాణ ప్రవచనము చేపట్టనున్నట్లు తెలిపారు. 12వ తేదీన ఉదయం 11.15 గంటలకు పూర్ణాహుతి అనంతరం కలశోద్వాసనము నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గీతాజయంతి ఉత్సవాల సందర్భంగా రాజన్నఆలయంలో భక్తులకు అభిషేకాలకు ఉదయం 8 గంటల నుంచి అనుమతి ఇవ్వనున్నారు.

కాసేపు ఫోన్‌కు దూరంగా..



● ఇండోర్ గేమ్స్ ఆడుతూ..

● చిన్నారులు, యువత ఆట, పాటలతో ఉత్సాహం

ఇంట్లో ఉన్నా..బయట ఉన్నా.. పని ఉన్నా లేకున్నా చేతిలో స్మార్ట్ ఫోన్ చూస్తూ ఉండడం షరా మామూలైపోయింది. ఇంట్లో కుటుంబ సభ్యులతో గడపడం కన్నా ఫోన్‌తో గడపడం నిత్యం అలవాటుగా మారిపోయింది. మరి ఇంట్లో పెద్ద వాళ్లను చూసో ఏమో గానీ పిల్లలు కూడా చాలా వరకు స్మార్ట్ ఫోన్‌కు వ్యసనంగా మారుతున్నారు. ఇంట్లో కుటుంబ సభ్యులు కూడా ఖాళీ ఉన్న సమయాల్లోనూ చేతిలో ఫోన్‌తోనే గడిపేస్తున్నారు. అలా అందరూ కూర్చుని పది నిమిషాల పాటు ఒకరికొకరు మాట్లాడుకునే సందర్భం కనుమరుగవుతోంది. స్మార్ట్ ఫోన్ నుంచి కాసేపు దూరంగా ఉండేందుకు కాస్త వెరైటీగా ఆలోచించారు ఆ యువకులు. కాసేపు ఫోన్ పక్కన పెట్టి ఇన్‌డోర్ గేమ్స్‌కు ఆటలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అలనాటి పాత ఆటలతో కాలక్షేపంతో పాటు అందరం కలుసుకుంటున్నామని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పిల్లలను సైతం ఈ ఆటల్లో ప్రోత్సహించడంతో స్మార్ట్ ఫోన్‌కు దూరంగా ఉంటున్నారు.


ఇండోర్ గేమ్స్ ఆడుతున్న చిన్నారులు

మల్యాల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈ రోజుల్లో ప్రతి ఒక్కరికీ సెల్‌ఫోన్ అందుబాటులో ఉండగా మొబైల్ లేనిదే నిద్ర లేవలేని పరిస్థితులు నెలకొన్నాయి. నిద్ర లేచిన నుంచి పడుకునే వరకు దైనందిన జీవితంలో సెల్‌ఫోన్ లేనిదే ఎలాంటి కార్యకలాపాలు జరుగలేని విధంగా స్మార్ట్‌ఫోన్ అలవాటైపోయింది. మాట్లాడడంతో పాటు డబ్బుల లావాదేవిలకు, వినోదం, ప్రయాణాలకు, కాలాక్షేపం లాంటి ఇంకా అనేక అంశాలతో సెల్‌ఫోన్ ముడిపడింది. ముఖ్యంగా చిన్నారులు ఫోన్‌కు అలవాటు పడుతుండడంతో వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీన్ని గమనించిన కొందరు యువకులు స్మార్ట్‌ఫోన్ నుంచి కొంత మేర అయినా బయట పడేందుకు కొత్త ఆలోచనతో ముందుకు వచ్చారు. మల్యాల మండలం రామన్నపేటలో నెలరోజులుగా గ్రామానికి చెందిన ఎం.డీ అజర్, కోరుట్ల రవి మరి కొందరు నిర్వహిస్తున్న ఈ కార్యకలాపాలకు ప్రజల నుంచి అభినందనలు అందుతున్నాయి.

● ఆటలతో స్మార్ట్‌ఫోన్‌కు దూరంగా..



పాఠశాలకు వెళ్లి వచ్చిన చిన్నారులు ఇంటికి రాగానే స్మార్ట్‌ఫోన్ పట్టడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందు తుండడంతో ఈ యువకులు ప్రత్యేకంగా ఓ గదిని అద్దెకు తీసుకొని కొంత డబ్బులు పోగు చేశారు. వాటితో క్యారం బోర్డు, బ్యాడ్మింటన్, చెస్ ఆడేవి తదితర పరిక రాలు, ఇతర క్రీడా సామగ్రి కొనుగోలు చేసి అందుబాటులో ఉంచారు. ఇందులో ఆటలతో పాటు చదువుకోవ డం, హోంవర్క్ చేయడం అలాగే చిన్నారులతో పాటు పెద్ద వారు సైతం వ్యాయామాలు చేస్తున్నారు. దీంతో కొన్ని గంటల పాటు అయినా చిన్నారులు, పెద్దలు స్మార్ట్ ఫోన్‌కు దూరంగా ఉంటారనేది వారి ఆలోచన.

● ఇప్పటికే అనేక సామాజిక కార్యక్రమాలు

రామన్నపేట గ్రామస్థుల మన ఊరు-మనవార్తలు వాట్సప్‌గ్రూప్‌తో ఇప్పటికే అనేక సామాజిక కార్యక్ర మాలు నిర్వహిస్తుండగా స్మార్ట్‌ఫోన్ వినియోగంతో కలిగే దుష్ప్రభావాల నియంత్రణకు ప్రతి రోజు సాయంత్రం ఆరు గంటల నుంచి వృద్ధులు, మహిళలు, చిన్నారులు, యువకులు అందరు ఒక చోట కలిసేలా ఏర్పాటు చేశారు. యువకుల ఆలోచనకు గ్రామస్థుల తోడ్పాటు అందడంతో నిత్యం ఇక్కడకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. ఆట. పాటలతో పాటు పుట్టిన రోజు, వివాహ వార్షికోత్సవాలు తదితర కార్యక్రమాలు కూడా చేసుకుంటున్నారు. కాసేపు స్మార్ట్‌ఫోన్ గురించి మరచిపోతుండడంతో గత గుర్తులు మళ్లీ యాదికొస్తున్నాయంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు స్ర్కీన్ టైం మోతాదుకు మించి వాడి ఆన్‌లైన్ గేమ్స్ నుంచి బయట పడకపోవడంతో అనారోగ్యంపై ప్రభావం చూపుతోందని, చిరాకు, మొండిగా ప్రవర్తించడాన్ని నివారించడానికి ఇంకా అనేక ఆలోచనలకు ఆ యువకులు పునాది వేస్తున్నారు.



కొనుగోలు చేసిన వివిధ రకాల పుస్తకాలు

● స్మార్ట్‌ఫోన్ వ్యసనం నుంచి బయటపడేందుకు..



స్మార్ట్‌ఫోన్ వ్యసనం నుంచి బయటపడేందుకు తాము ఈ కార్యక్రమం చేపట్టాము. స్మార్ట్‌ఫోన్ వల్ల కలిగే నష్టాలు, హానికర యాప్స్, సమయ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్నాము. ఆరోగ్యకరమైన జీవన శైలి కోసం తాము ఈ ప్రయత్నం చేశాము. ప్రజలు, చిన్నారులు సద్వినియోగం చేసుకుంటున్నారు.

- ఎం.డీ అజర్, వ్యవస్థాపక సభ్యుడు, రామన్నపేట

● కాలక్షేపం చేస్తున్నాం



స్మార్ట్‌ఫోన్ పక్కన పెట్టి నిత్యం ఇక్కడకు వచ్చి ఆటలు ఆడుతూ, కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తున్నాం. దీంతో ఆ సమయంలో స్మార్ట్‌ఫోన్ వాడడం లేదు. క్యారం, అష్టాచమ్మాలాంటి పాత ఆటలు ఆడు తూ మైమరిచిపోతున్నాం. పుస్తకాలలోని బొమ్మలతో సరదాగా ఉంటుంది. సెల్‌ఫోన్ వాడడం దాని వల్ల కలిగే నష్టాల గురించి చెబుతున్నారు.

- గీతాంజలి, గ్రామస్థురాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ముస్తాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొని ఓ యువకుడి మృతిచెందిన సంఘటన ముస్తాబాద్ మండలంలోని గుడెం శివారులో చిప్పలపల్లి గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే చిప్పలపల్లి గ్రామానికి చెందిన జంగిటి సాయి(18) అనే యువకుడు డీజిల్ తీసుకురావడానికి వెళ్తుండగా గూడెం మూలమలుపు వద్ద బైక్ చెట్టుకు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లిదండ్రులు కిషన్ భాగ్యలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ముగ్గురు ఆడపిల్లల తరువాత ఉన్న ఒక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గణేష్ తెలిపారు.

దుబాయ్‌లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) ఆధ్వర్యంలో దుబాయ్‌లో బైక్‌రైడర్స్, డెలివరీ బాయ్స్, సెక్యూరిటీగార్డు ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి తెలిపారు. డెలివరీ బాయ్స్, బైక్ రైడర్ల ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణతతో కనీసం రెండు సంవత్సరాల డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. అభ్యర్థుల వయస్సు 21-40 సంవత్సరాల మధ్య ఉండి పాస్‌పోర్టు ఉన్నవారు అర్హులని తెలిపారు. సెక్యూరిటీ ఉద్యోగాలకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై 21-32 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలన్నారు. వివరాలకు 9440050951, 9440049861 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలు

గుత్తిరూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా గుత్తి మండలం కరిడికొండ గ్రామ శివారులో గల 44వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన బాలప్రకాష్, దివ్య దంపతులు తమ కుమారుడు వివాన్‌తో కలిసి కారులో బెంగళూరుకు వెళ్తున్నారు. కరిడికొండ గ్రామశివారులోకి రాగానే కారు ప్రమాదవశాత్తూ డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో బాలుడు వివాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వర్గీకరణపై ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్గీకరణపై అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందె కార్తిక్ డిమాండ్ చేశారు. సోమవారం ఉమ్మడి జిల్లా మాదిగ విద్యార్థుల మహాసభను పురస్కరించుకొని స్థానిక కార్ఖానగడ్డలో విద్యార్థులు, కులపెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1న సుప్రీంకోర్టు తీర్పు న్యాయబద్ధమైనదని, అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణ రాష్ట్రంలో వర్గీకరణ చేసి చూపిస్తామని ముఖ్యమంత్రి మాటి ఇచ్చి తప్పారని అన్నారు. మాట తప్పిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై మరో పోరాటానికి మాదిగ విద్యార్థులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి తన మంత్రి పదవికోసం మాలలను రెచ్చగొడుతూ తన స్వంత డబ్బుతో వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేయిస్తున్నాడని ఆరోపించారు. దీనిని మాల మేధావులు, విద్యావేత్తలు తక్షణమే ఖండించి వర్గీకరణ సామాజిక న్యాయమని వర్గీకరణ చేసుకొని మాల మాదిగలు అన్నదమ్ములుగా కలిసి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చెంచల నవీన్, ప్రధాన కార్యదర్శి కొరపు ప్రభాకర్, ఎంఎస్‌పీ అధికార ప్రతినిధి దండు అంజయ్య, ఎంఆర్‌పీఎస్ టౌన్ అధ్యక్షుడు దండు మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

మళ్లీ శ్మశానానికి చేరిన తల్లి

● రెండోసారి వదిలివెళ్లిన కొడుకులు


వృద్ధురాలితో మాట్లాడుతున్న మహిళలు

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణానికి చెందిన అల్లం రాజవ్వ అనే వృద్ధురాలిని తన కుమారులు మళ్లీ శ్మశాన వాటికలో వదిలివెళ్లారు. పక్షం రోజుల క్రితం వృద్ధురాలిని శ్మశాన వాటికలో వదిలివెళ్లగా సఖీ సెంటర్ నిర్వాహకులు వృద్ధురాలిని జగిత్యాల ప్రధాన ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. అనంతరం జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు హరి అశోక్‌కుమార్‌లు వృద్ధురాలి కుమారులను పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించి కుమారులకు అప్పగించారు. అయితే వారు వృద్ధురాలిని తిరిగి శ్మశాన వాటికలో వదిలారు. వృద్ధురాలికి చెందిన సమీప బంధువులు మరణించడంతో మూడవ రోజు కార్యక్రమానికి వచ్చిన ఓ మహిళ వృద్ధురాలి గొంతు విని ఇక్కడ ఎందుకు ఉన్నావని అడిగింది. దీంతో తన కుమారుడు సీనయ్య తనను వదిలి వెళ్లాడని ఆమెతో వృద్ధురాలు వాపోయింది. కొంచెం అన్నం పెట్టి, కప్పుకోడానికి ఏదైనా ఇవ్వమంటూ సదరు మహిళను అడగడం అక్కడున్న వారిని కలిచి వేసింది.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు సిరిసేడు విద్యార్థి ఎంపిక

ఇల్లందకుంట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలం సిరిసేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న నాగపూర్ శ్రీచరణ్ రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 4న కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఈ టెక్నో మైదానంలో ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-14 బాల బాలికల నెట్ బాల్ సెలక్షన్స్ జరిగాయి. ఈ నెల 9,10,11వ తేదీల్లో కరీంనగర్‌లోని ఆల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు శ్రీచరణ్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శ్రీచరణ్‌ను హెచ్ఎం జగదీశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

అథ్లెటిక్స్ జాతీయ పతక విజేతకు అభినందన


నక్షత్రను అభినందిస్తున్న రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘ ప్రతినిధులు

కరీంనగర్ స్పోర్ట్స్ డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరుగుతున్న 39వ జాతీయ జూనియర్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన గైని నక్షత్ర కాంస్య పతకం సాధించింది. అండర్-14 బాలికల విభాగంలో ట్రయాథ్లిన్ పోటీల్లో పాల్గొన్న ఆమె విశేష ప్రతిభచాటి కాంస్య పతకం సాధించింది. గత సెప్టెంబర్ 17 నుంచి 19 వరకు గుంటూరులో జరిగిన సౌత్‌జోన్ పోటీల్లో రజత పతకం సాధించింది. ఈ సందర్భంగా నక్షత్రనను, ఆమెకు శిక్షణ అందించిన కోచ్ తిరుపతిని రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు స్టాన్లీ జోన్స్, సారంగపాణి, కోశాధికారి రాజేశ్ కుమార్, రాష్ట్ర సంఘ బాధ్యులు వెంకట్‌రెడ్డి, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి అభినందించారు.

రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి : డీటీసీ


సమావేశంలో మాట్లాడుతున్న డీటీసీ పురుషోత్తం

తిమ్మాపూర్,డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): వాహన షోరూం నిర్వాహకులు వాహన కొనుగోలుదారులకు రోడ్డు సేఫ్టీపై అవగాహన కల్పించాలని డీటీసీ పెద్దింటి పురుషోత్తం ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో జిల్లాలోని వాహన షోరూం నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వాహనాల కొనుగోలు సమయంలో షోరూం నిర్వాహకులు వివరాలు నమోదు చేసుకోవడంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తప్పులు జరుగుతున్నాయని అన్నారు. ఆధార్ కార్డులో ఉన్న చిరునామా పోస్టల్ అడ్రస్, మండలాలు సక్రమంగా ఉండేవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేసే ప్రూఫ్‌లు సక్రమంగా ఫొటోలు తీయకపోవడం, ఇన్‌వాయిస్ ఇతరాల్లో తప్పులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో రిజిస్ట్రేషన్‌లో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్, కారు నడిపే వారు ఖచ్చితంగా సీటు బెల్టు ధరించే విధంగా, అతివేగంగా వాహనాలు నడపవద్దని అవగాహన కల్పించాలన్నారు. నూతన వాహనాలు రిజిస్ట్రేషన్‌కు వచ్చినప్పుడు కొన్ని వాహనాలకు సంబంధించిన ఛాసిస్ నెంబర్లు సరిగా కనబడటం లేదన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఇబ్బందులు ఏర్పాడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐలు శ్రీకాంత్ చక్రవర్తి, రవికుమార్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మొక్కజొన్న పంటలపై అడవి పందుల దాడి

● 15 ఎకరాల్లో పంట ధ్వంసం


పొత్కపల్లిలో ధ్వంసమైన మొక్కజొన్న పంట

ఓదెల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్కపల్లి, రూపునారాయణపేట, జీలకుంట, శానగొండ, గొల్లపల్లి, గ్రామాల్లోని మొక్కజొన్న పంటలపై ఆది, సోమవారాల్లో అడవి పందులు దాడి చేసి బీభత్సం సృష్టించాయి. పొత్కపల్లి అనుబంధ గ్రామం గొల్లపల్లికి చెందిన కనవేని కొమురయ్య అనే రైతుకు చెందిన ఎకరన్నర మొక్కజొన్న పంటను దాదాపు 50 శాతం ధ్వంసం చేశాయి. లేత గింజ దశలో ఉన్న మొక్కజొన్నను అడవి పందుల గుంపు ధ్వంసం చేస్తుండడంతో రాత్రింబవళ్లు సైతం కాపలా కాస్తున్నామని, అయినప్పటికీ పంట ధ్వంసం ఆగడం లేదని కొమురయ్య ఆవేదన వ్యక్తం చేశారు. చేతికంది వచ్చిన మొక్కజొన్న పంటల్లోనే పందులు తిష్ట వేసి ధ్వంసం చేయడమే కాకుండా, ఒంటరిగా ఉన్న రైతులపై కూడా దాడికి ప్రయత్నిస్తున్నాయని రూప్‌నారాయణపేట, జీలకుంట రైతులు తెలిపారు. అడవి పందుల నుంచి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులను రైతులు కోరారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

ఎలిగేడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాములపల్లి-నారాయణపూర్ గ్రామాల మధ్య ఉన్న ఎస్సారెస్పీ ఉపకాలువ వద్ద బైక్ అదుపుతప్పి అదేకాలువలో పడి సిరిసిల్ల కిరణ్(37) అనే యువకుడు మృతి చెందాడు. జూలపల్లి ఇన్‌చార్జి ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖని పవర్‌హౌస్ కాలనీకి చెందిన కిరణ్ కరీంనగర్‌లోని ఫైనాన్స్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటీవ్‌గా పని చేస్తున్నాడు. జూలపల్లి మండలం చీమలపేటకు చెందిన తన స్నేహితుడిని కలిసి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు కిరణ్ భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నరేష్ పేర్కొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● బంగారం, వెండి, నగదు అపహరణ


చిందరవందరగా పడి ఉన్న వస్తువులను పరిశీలిస్తున్న సీఐ

కమాన్‌పూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్‌గా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారు. తాజాగా మండల కేంద్రంలోని పోస్టాఫీస్ వీధిలో బిల్లా రాజయ్య ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడి ఇంటికి గత నెల 27న వెళ్లారు. ఆదివారం రాత్రి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లో వెళ్లి చూడగా ఇంట్లోని బీరువాను పగలగొట్టి అందులో ఉన్న 11 తులాల బంగారం, 80 తులాల వెండి, రూ. 30 వేల నగదును గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా సోమవారం గోదావరిఖని టూటౌన్ సీఐ నక్క ప్రసాద్, ఎస్ఐ కొట్టె ప్రసాద్, పోలీస్ సిబ్బంది ఇంటి పరిసరాలను పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక డంపుల స్వాధీనం


నిలువ ఉన్న కుప్పలను సీజ్ చేస్తున్న ఆర్ఐ మహ్మద్ అమర్

కోరుట్ల రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎఖీన్‌పూర్ నుంచి ఎస్సారెస్పీ కాలువ ద్వారా నాగులపేటకు వెళ్లే రహదారిని ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో అక్రమంగా నిలువ ఉన్న ఇసుక కుప్పలను సోమవారం ఆర్ఐ మహ్మద్ అమర్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. సుమార్ 50 నుంచి 60 ఇసుక కుప్పలు ఉన్నట్లు వాటిని సీజ్ చేసినట్లు ఆర్ఐ మహ్మద్ అమర్ తెలిపారు. నాగులపేట నుంచి కోరుట్ల వైపు అక్రమంలో ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఆర్ఐ తెలిపారు. ట్రాక్టర్లను రెవెన్యూ కార్యాలయానికి తరలించినట్లు ఆర్ఐ వివరించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

మల్లాపూర్ : అనుమతులు లేకుండా గోదావరి, వాగుల పరివాహక ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని మల్లాపూర్ తహసీల్దార్ వీర్‌సింగ్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని వాల్గొండ గ్రామ శివారులోని గోదావరి నుంచి అక్రమంగా ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని చర్యల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

ఇసుక లారీలను అడ్డుకున్న ఊటూర్ గ్రామస్థులు

మానకొండూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊటూర్ మానేరు వాగు నుంచి ఇసుకను తరలించడంతో రోడ్డు దెబ్బతింటుందని గ్రామస్థులు సోమవారం రాత్రి ఇసుక లారీలను అడ్డుకున్నారు. ప్రతినిత్యం వందలాది లారీలు మానేరు వాగు నుంచి ఇసుకను తరలించడం వల్ల రోడ్డు దెబ్బతినడమే కాకుండా దుమ్ము, ధూళితో రోడ్డుప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చొరువ తీసుకొని రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శంకరపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన మోహన్‌కుమార్ (21) అనే వ్యక్తి గోపాల్‌పూర్‌లోని వల్లెపు యాదగిరి వద్ద కూలీ పనిచేస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి గోపాల్‌పూర్ నుంచి కొత్తగట్టుకు టీఎస్03ఈఆర్0606 ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. బైక్ అజాగ్రత్తగా, అతివేగంగా నడపడంతో కొత్తగట్టు గ్రామ శివారులోని జేసీఎం ఫంక్షన్ హాల్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో మోహన్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి సోదరుడు అమర్ చౌదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

న్యాయం గెలిచింది..

- ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్



వేములవాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘకాలంగా తాను చేస్తున్న పోరాటం ఫలించిందని, న్యాయం గెలిచిందని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ పౌరసత్వాన్ని రద్దు చేస్తూ రాష్ట్ర హైకోర్టు తీర్పుపై సోమవారం ఆయన స్పందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. 15 ఏళ్లుగా తాను చేస్తున్న న్యాయపోరాటానికి ఇన్నేళ్లకు ముగింపు లభించిందన్నారు. ఇన్నేళ్ల తన న్యాయ పోరాటానికి సహకరించిన వారందరికీ, మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నానని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. అభ్యర్థిత్వంపై మోసం చేసినందుకు చెన్నమనేని రమేష్‌పై చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరనున్నట్లు చెప్పారు.

పౌరసత్వం వివాదం సృష్టించారు

- చెన్నమనేని రమేశ్



తన పౌరసత్వం రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పు తనకు తీవ్ర నిరాశను కలిగించిందని వేముల వాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ అన్నారు. హైకోర్టు తీర్పు వెలువరించిన అనంతరం ఆయన సోమవారం తన వ్యక్తిగత సహాయకుల ద్వారా తన అభిప్రాయాన్ని పంపించారు. హైకోర్టులో తన పౌరసత్వం పైన వెలువడిన తీర్పు తీవ్రంగా నిరాశపరిచిందని, ఈ తీర్పు హేతుబద్ధంగా లేదన్న అభిప్రాయంతో తాను ఏకీభవిస్తున్నానని పేర్కొన్నారు. రాజకీయ జీవితంలో ఒడిదొడుకులు సహజ మని, వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తనపై కుట్ర చేసి పౌరసత్వ వివాదం సృష్టిం చారని, హైకోర్టు తీర్పుపై అప్పీలు చేయడానికి గల అవకాశాలను తన న్యాయవాదులు పరిశీలిస్తున్నారని చెన్నమనేని రమేష్ తెలిపారు.

పొగాకు వైపు రైతుల చూపు

- అధిక ధర పలుకుతుండడంతో ఆసక్తి
- భిన్నమైన పంటల సాగుతో లాభాలు



గుజ్జులపల్లిలో ఆరేందుకు కొట్టంలో కట్టిన పొగాకు తోరణాలు



గొడిశాలలో ఏపుగా పెరిగి కోత దశలో ఉన్న పొగాకు తోట

సైదాపూర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రతి సారి ఒకే పంట వరి, మొక్కజొన్న, పత్తి పంటలు వేయడం వల్ల దిగుబడి తగ్గి నష్టాలపాలవుతున్నారు. దీంతో రైతులు ప్రత్యామ్నాయ మార్గం వైపు అడుగులు వేస్తున్నారు. ఆరుతడి పంటలు అందులో ఆదాయం ఎక్కువ వచ్చే పంటల సాగుపై మొగ్గు చూపుతున్నారు. ఆయిల్ పామ్ సాగు చేయాలని ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోంది. పొగాకు సాగు లాభదాయకంగా ఉండ టంతో రైతులు సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. సైదా పూర్ మండలంలోని గొడిశాల, నల్లరామయ్యపల్లి, గుజ్జులపల్లి, ఎల్లంపల్లి, రాంచంద్రాపూర్, ఎలబోతారం, చింతలపల్లి, జాగీర్‌పల్లి గ్రామాలతో పాటు మరి కొన్ని గ్రామాలలో మొక్కజొన్న, పత్తికి బదులుగా రైతులు పొగాకు సాగు చేస్తున్నారు. ఈ పొగాకు సాగుకు పని ఎక్కువగా ఉన్నప్పటికి ఆదాయం ఎక్కువ వస్తుందని రైతులు మొగ్గు చూపుతున్నారు. గత సంవత్సరం పొగాకు సాగు చేసిన రైతులకు మంచి ధర పలికి ఒక ఎకరాకి రూ. 2.5 నుంచి 3లక్షల వరకు ఆదాయం వచ్చిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం క్వింటాల్‌కు రూ. 15,000 నుంచి 20,000 వేల వరకు ధర పలికిందని తెలుపుతున్నారు. ఈ సంవ త్సరం కూడా మంచి ధర పలుకుతుందని రైతులు భావి స్తున్నారు. మరోవైపు పొగాకు నారు 2వేల మొక్కలకు సుమారు 3500 ధర పలుకుతుంది. దాంతో పొగాకు నారు యజమానులు ఒక ఎకరాకు సుమారు 5నుంచి 8లక్షల వరకు సంపాదిస్తున్నట్లు రైతులు తెలు పుతున్నారు.

● పొగాకుతో పని ఎక్కువే

పొగాకు సాగు సుమారు నాలుగు నెలలో పూర్తవు తుంది. మొక్కలు ఏపుగా పెరిగే వరకు ఎరువులు వేస్తూ, కలుపు తీస్తూ, నీరు సంవృద్ధిగా కట్టాలి. మొక్కలు కొంచెం పెరగగానే మొక్క కింది భాగంలో ఎరుపుగా మారిన ఆకులు తీసి వాటిని తోరణాలు గుచ్చి నీడలో ఆరబెట్టాలి. పూర్తిగా ఎండిన తరువాత ఆ తోరణాలు తీసి ఎండిన పొగాకును మండెగా వేయాలి. చెక్క బాక్సు లలో తొక్కి బేల్లుగా తయారు చేయాలి. అప్పుడు వాటిని వ్యాపారులకు విక్రయించాలి. ఇలా ఒక్కొక్క చెక్కు 50నుంచి 100కేజీల వరకు ఉంటుంది. సుమారు 3 నెలలు పని ఉంటుంది. కానీ ధర సక్రమంగా ఉంటే ఆదాయం అలాగే రెట్టింపుగా వస్తుందని రైతులు తెలుపుతున్నారు.



జాగీర్‌పల్లిలో మండెగా వేసిన ఎండిన పొగాకు

● పొగాకు లాభదాయకమే

కష్టపడి పనిచేస్తే అన్ని పంటల కన్నా పొగాకుతో లాభంగానే ఉంటుంది. ఒక రెండు నెలలు ప్రతి రోజు పొగాకు పనిమీదనే ఉండాలి. దానిని సరైన సమయం లో ఆకు తీసి ఆరబెట్టి మండెకట్టి ఆకును నల్లబడ కుండా చూసుకోవాలి. గత సంవత్సరం 20 గుంటల వరకు పొగాకు సాగు చేశాను మంచి లాభం వచ్చింది. ఈ సంవత్సరం ఒక ఎకరం వరకు సాగు చేస్తున్నా.

- గుడిసే శ్రీనివాస్, రైతు, జాగీర్‌పల్లి

కొండగట్టులో ముగిసిన విజయోత్సవాలు



కొండగట్టులో నిర్వహిస్తున్న పూజలలో పాల్గొన్న అర్చకులు, సిబ్బంది

మల్యాల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో జరుగుతున్న ప్రజాపాలన-ప్రజావిజయోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు రాష్ట్ర సుభిక్షం కోసం ఆలయ స్థానాచార్యులు కపీందర్, ప్రధానార్చకులు జితేంద్రప్రసాద్, రామకృష్ణ, ఉపప్రధానర్చకులు చిరంజీవ స్వామి, మారుతీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, రామభజన కార్యక్ర మాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, నీల చంద్రశేఖర్, ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాహిత్యంపై దృష్టి సారించాలి

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వారాల ఆనంద్



మాట్లాడుతున్న వారాల ఆనంద్

గణేశ్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాహిత్యంపై దృష్టి సారించాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వారాల ఆనంద్ అన్నారు. ఇతర భాషల విలువలను, సంస్కృతిని, రచన తత్వాన్ని మరో భాషలోకి తీసుకురావడం లక్ష్యంగా అనువాదం సాగుతుందన్నారు. సోమవారం ఎస్సారార్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు అనువాద పద్ధతులపై ఒక్కరోజు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా వారాల ఆనంద్ విద్యార్థులకు తెలుగు అనువాదంలోని మెళకువలను తెలియజేశారు. ఈసందర్భంగా ఎస్సారార్ ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు సాహిత్యాన్ని తమ జీవితంలో భాగంగా చేసుకొని పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని రూపొందించుకోవాలన్నారు. తెలుగు విభాగాధిపతి డా.బూర్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ అనువాదాలు చేసేవారు మాతృభాషా సాహిత్యాలను బాగా అధ్యయనం చేయాలన్నారు. కార్యక్రమంలో అటానమస్ కోఆర్డినేటర్ వంగల శ్రీనివాస్, అధ్యాపకులు బూర్ల వేంకటేశ్వర్లు, ప్రకాశ్, డా.ఆర్ శ్రీనివాస్, మెట్టు వేంకటేశ్వర్లు, డా. పాత అశోక్, డా. పి. చైతన్య, డా. పి. అనిల్ కుమార్, పి. శంకర్, డా. టి.భోజన్న పాల్గొన్నారు.

కాసులు కురిపిస్తున్న ఆర్టీసీ కార్గో



పంపించడానికి సిద్ధంగా ఉన్న పార్సిల్స్

- రూ.9 కోట్లకు చేరువలో రీజియన్ సంవత్సర ఆదాయం
- సగానికి పైగా ఆదాయం కరీంనగర్ కౌంటర్‌లోనే

భగత్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ కార్గో సేవలతో కాసులు కురిపిస్తున్నది. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా 11 డిపోలు కరీంనగర్-1, కరీంనగర్-2, గోదావరిఖని, హుస్నాబాద్, హుజూరాబాద్, మంథని, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, సిరిసిల్ల, వేములవాడ డిపోలు ఉన్నాయి. డిపోల వారీగా కార్గో కౌంటర్లు ఏర్పాట్లు చేసి పార్సిల్స్ పంపించడం, వచ్చిన పార్సిల్స్‌ను బట్వాడ చేయడంతో ఆర్టీసీకి ఆదాయం సమకూరుతున్నది. రీజియన్ వ్యాప్తంగా పోల్చుకుంటే మొత్తం వచ్చిన ఆదాయంలో సగానికి పైగా కరీంనగర్ కౌంటర్ నుంచే వస్తోంది. కరీంనగర్ రీజియన్‌లో కార్గో సేవలతో ఆదాయ సముపార్జనలో ముందంజలో ఉంటున్నది. జనవరి నుంచి నవంబరు మాసం వరకు ఇప్పటి వరకు రీజియన్ వ్యాప్తంగా 8,76,62,753 రూపాయల ఆదాయం సమకూరింది.

● కరీంనగర్ కౌంటర్‌లో ఆదాయం

నెల	పార్సిల్స్ సంఖ్య	ఆదాయం
జనవరి	25,538	41,76,460
ఫిబ్రవరి	22,706	39,27,486
మార్చి	23,053	40,39,050
ఏప్రిల్	22,018	39,23,880
మే	23,625	41,78,474
జూన్	22,856	41,47,712
జులై	22,882	39,28,111
ఆగస్టు	24,165	42,20,101
సెప్టెంబర్	22,731	40,84,057
అక్టోబర్	24,815	44,74,236
నవంబర్	25,232	45,43,992
మొత్తం	2,59,621	4,56,43,559

కరీంనగర్ కౌంటర్‌లో ఇప్పటి వరకు 4,56,43,559 రూపాయల ఆదాయం సమకూరింది.

● జిల్లా వ్యాప్తంగా కౌంటర్లు

కార్గో సేవలందించడానికి ఆర్టీసీ 44 కౌంటర్లు ఏర్పాట్లు చేసి పార్సిల్స్‌ను అందిస్తున్నారు. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా డిపోల పరిధిలో ఏజెంట్లను నియమించి కౌంటర్లు ఏర్పాట్లుచేసి కార్గో సేవలు అందిస్తున్నారు. గోదావరిఖని డిపో పరిధిలో 3, హుస్నాబాద్ డిపో పరిధిలో 4, హుజూరాబాద్ 7, కరీంనగర్-1 డిపో పరిధిలో 6, కరీంనగర్-2 డిపో పరిధిలో 4, మంథని పరిధిలో 3, జగిత్యాల పరిధిలో 6, కోరుట్ల పరిధిలో 4, మెట్‌పల్లిలో 1, సిరిసిల్లలో 5, వేములవాడలో ఒక కౌంటర్ ఉన్నాయి. ఇందులో కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల డిపోల్లో ఆర్టీసీ సొంతంగా కౌంటర్లు ఏర్పాటుచేసి కార్గో సేవలు అందిస్తున్నది. ప్రయాణికులను చేరవేయడమే కాకుండా తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అదనపు ఆదాయ మార్గాలను అన్వేషించి కార్గో సేవలందిస్తూ అధిక ఆదాయాన్ని ఆర్జిస్తోంది.

రీజియన్ వ్యాప్తంగా వచ్చిన ఆదాయం

నెల	పార్సిల్స్ సంఖ్య	ఆదాయం
జనవరి	51,163	83,50,042
ఫిబ్రవరి	43,709	75,73,966
మార్చి	44,860	78,56,245
ఏప్రిల్	44,059	78,93,985
మే	45,939	79,25,789
జూన్	43,049	76,76,432
జులై	43,557	74,41,901
ఆగస్టు	46,761	81,92,080
సెప్టెంబర్	43,738	78,70,135
అక్టోబరు	46,761	82,83,079
నవంబరు	47,623	85,99,099
మొత్తం	5,01,227	8,76,62,753

ప్రయాణికులకు సౌకర్యాలు అందించాలి

- ఆర్టీసీ రీజినల్ మేనేజర్లతో ఈడీ సమీక్షా సమావేశం



రీజినల్ మేనేజర్లతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జోన్ ఈడీ ఖుస్రోషాఖాన్


భగత్‌నగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రోషాఖాన్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన రీజినల్ మేనేజర్లతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఆదాయ వనరులను మెరుగు పరుచు కోవాలన్నారు. ప్రమాదాలను నివారించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్లు రాజు, సోలమన్ రాజు, సరిరాం, విజయభాను, జ్యోత్స్న, డిప్యూటి రీజినల్ మేనేజర్లు కె సత్యనారాయణ, ఎస్ భూపతిరెడ్డి, సరస్వతి, శంకర్, ప్రవీణ్, భాను కిరణ్, మాధవరావు, భవాణిప్రసాద్, డిప్యూటి చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్, స్వప్నకుమారి, వర్క్స్ మేనేజర్ సుగుణాకర్‌రావు, కె యుగేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, బోయేజ్‌కుమార్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

● ఏసీ బస్సు సర్వీసుల్లో పది శాతం రాయితీ

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏసీ స్లీపర్, ఏసీ స్లీపర్‌కమ్ సీటర్, రాజధాని బస్సుల్లో తెలంగాణ, అంతర్రాష్ట్ర ప్రయాణికులకు గాను బేసిక్ చార్జీలో పదిశాతం రాయితీ కల్పిస్తున్నట్లు రీజినల్ మేనేజర్ రాజు ఒకప్రకటనలో తెలి పారు. ఈ అవకాశం డిసెంబరు 31వరకు ఉంటుందని ప్రయాణికులు వినియోగించుకోవాలన్నారు.

కొండెక్కిన కోడిగుడ్డు

● ఒక్కింటికి రూ. 7.50



హుజూరాబాద్‌రూరల్, డిసెంబర్ 9, (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో కోడిగుడ్ల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. ఇదే సమ యంలో చికెన్ ధరలు తగ్గుతూ వస్తున్నాయి. ఒక కోడిగుడ్డు ధర హోల్‌సేల్‌గా రూ. 6.2లు కాగా, రిటైల్ కాగా రూ.7 పలుకుతుండగా, గ్రామాల్లోని చిన్న దుకాణాల్లో మాత్రం రూ.7.50 ధర పలు కుతోంది. చలికాలంలో కోడిగుడ్ల ధరలు పెరగడం సాధారణమేనని కొందరు వ్యాపారులు చెబుతున్నారు. ఈ నెలలో క్రిస్మస్ పండగ ఉంది. ఈ వేడుకల్లో ప్రధానంగా కేకులు కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలో ముందదస్తు క్రిస్మస్ వేడుకలు ప్రారంభమ య్యాయి. ఇదే సమయంలో కేక్‌ల వినియోగం, విక్రయాలు పెరిగాయి. కేక్‌ల తయారీలో కోడిగుడ్ల వినియోగం అధికంగా ఉంటుంది. దీంతో సహజంగానే వాటికి డిమాండ్ పెరుగుతుందని కొందరు చెపుతున్నారు.

● చికెన్ ధర తగ్గుదల

కార్తీక మాసం నేపథ్యంలో చికెన్‌ధరలు తగ్గాయి. కార్తీకమాసం ప్రారంభంలో కేజి చికెన్‌ధర రూ. 230 వరకు పలికింది. మాంసాహారానికి దూరంగా ఉండటంతో డిమాండ్ పడిపోయిందని, ఫలితంగా చికెన్‌ధరలు దిగొచ్చాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం కేజీ ధర రూ. 185 పలుకుతుంది. క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి వరకు చికెన్ ధరలు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

రూ. 7.5కు గుడ్డును అమ్ముతున్నారు

-చిరంజీవి, కనుకులగిద్దె



కోడిగుడ్డు రూ. 5 నుంచి ఏకంగా రూ. 7.5 వరకు ధర పెరిగింది. సామాన్యుడు కోడిగుడ్డు తినాలంటే భారమే. పిల్లలకు పౌష్టికాహారం అందించాలని కోడిగుడ్డు తినిపిస్తున్నాం. ఇప్పుడు ధర పెరుగడంతో తినిపించలేకపోతున్నాం.

కోడెలు అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిపై చర్య తీసుకోవాలి

- వేములవాడ పట్టణ పోలీసులకు బీజేపీ నేతల ఫిర్యాదు



వేములవాడ పట్టణ ఎస్సై అంజయ్యకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం గోశాల నుండి కోడెలను తీసుకువెళ్లి గోవధశాలకు విక్రయిస్తున్న మాదాసు రాంబాబు అనే వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వేములవాడ పట్టణ బీజేపీ అధ్యక్షుడు, పురపాలక సంఘం 20వ వార్డు కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు పోలీసులను కోరారు. ఈ మేరకు స్థానిక బీజేపీ నేతలతో కలిసి సోమవారం వేములవాడ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం మనుగొండ గ్రామానికి చెందిన మాదాసు రాంబాబు అనే వ్యక్తి ఓ సొసైటీ పేరుతో దాదాపుగా 60 కోడెలను వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవాలయం గోశాల నుండి తీసుకెళ్లి అక్రమంగా గోవధ శాలలకు అమ్ముతున్నట్లు తేలిందని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి సమగ్రంగా విచారణ జరిపి సదరు వ్యక్తితో పాటు అతనికి సహకరించిన అందరిపై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం గోశాలలో జరుగుతున్న అక్రమాలపై పోలీసు శాఖ పక్షాన విచారణ జరపాలని కోరినట్లు ఈ సందర్భంగా రేగుల సంతోష్ బాబు తెలిపారు. దేవాలయాల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నట్లు కోడెల వ్యవహారంతో స్పష్టంగా తెలిసిపోతున్నదని, రాజన్న కోడెలను అక్రమంగా దళారులకు దొంగ చాటుగా అందజేస్తున్నారని అన్నారు. రైతులకు కోడెల పంపిణీ పేరిట పెద్ద ఎత్తున హంగు ఆర్భాటాలతో కార్యక్రమం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం కోడెల పంపిణీలో జరుగుతున్న అక్రమాలను పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తున్నదని అన్నారు. మొత్తం వ్యవహారంపై ప్రభుత్వం సైతం సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని, మరోసారి కోడెలు పక్కదారి పట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంతోష్ బాబు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పిన్నింటి హనుమాన్లు, అక్కపెల్లి వివేక్ రెడ్డి, గుడిసె మనోజ్, రేగుల రాజకుమార్, నామాల శేఖర్, బిల్ల కృష్ణ, ఫైలారం శ్రీనివాస్, జవ్వాజి రాజశేఖర్, రేగుల శ్రీకాంత్, మామిళ్ళ లక్ష్మీరాజం, నేరెళ్ల సాయి, సగ్గు రాహుల్, కోరేపు వెంకటేష్ పాల్గొన్నారు.

వేములవాడకు పోటెత్తిన భక్తజనం



భక్తులతో కోలాహలంగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రానికి సోమవారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాలను తరలివచ్చిన భక్తులు కోనేరులో పవిత్రస్నానాలు ఆచరించి, కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. తెల్లవారు జాము నుంచి కోడె మొక్కు క్యూలైన్‌లో బారులుదీరారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు సుమారు మూడు గంటలపాటు నిరీక్షిం చారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్ దర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ భక్తులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆర్థిక సహాయం అందజేత

మల్యాల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగట్టుకు చెందిన చెప్యాల తిరుపతి అనే గీతకార్మికుడు ప్రమాదవశత్తూ జారీ పడడంతో కాలుకు తీవ్ర గాయాలు కాగ ముత్యంపేట ఎన్ఆర్ఐ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. 10వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మర్రి మల్లేశం, బొమ్మకంటి మహేష్, ఒల్లాల మహేశ్, గుండేటి సంజీవ్, పెరుమండ్ల శ్రీనివాస్, కోల మహేశ్, ఒల్లాల మహేష్ పాల్గొన్నారు

దేవాదాయ పరిధిలోకి వెల్లుల్ల ఎల్లమ్మ ఆలయం

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్, 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లుల్ల ఎ ల్లమ్మ ఆలయం దేవాదాయ శాఖ పరిధిలోకి చేరనుంది. ఆలయ ఆదాయం వివరాలు నిర్వహకులు తెలియజేయనందున దేవాదాయ శాఖ అధికారులు విలీనం చేసేందుకు సమాయత్తమయ్యారు. సోమవారం ఎండోమెంట్స్ యాక్ట్ కింద ఆలయ ఇన్‌చార్జి ఈవోగా కాంతారెడ్డిని నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బూత్ కమిటీ అధ్యక్షులు స్థానికంగా బీజేపీ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్ కోరారు. సోమవారం పట్టణంలోని వెంకట్రావ్‌పేట 11వ వార్డులో బూత్ కమిటీ నియామకాలను చేపట్టారు. 190 వ బూత్ అధ్యక్షుడిగా తాళ్లపల్లి క్రాంతి కిరణ్, 191వ బూత్ అధ్యక్షుడిగా దండికే నర్సయ్యలను నియమించినట్లు తెలిపారు. వారికి నియామక పత్రం అందజేశారు. అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్, అనిల్ పాల్గొన్నారు.

వైద్యాధికారి సమీక్ష

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని మోతెవాడ, ఖిలా గడ్డ ఆరోగ్య కేంద్రాల సిబ్బందితో జిల్లా వైద్యాధికారి ప్రమోద్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వంద శాతం గర్భవతుల నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ ఉన్నారు.

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



మల్లాపూర్‌లో కేక్ కట్ చేస్తున్న జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంలోని జువ్వాడి భవనంలో సోమవారం కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ పన్నాల అంజిరెడ్డి, వార్డు కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం కాంగ్రెస్ నాయకులు కొంత రాజం, తిరుమల గంగాధర్ పాల్గొన్నారు.

ధర్మపురి: ఏఐసీసీ నాయకురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలు ధర్మపురి మండల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య-లక్ష్మణ్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, కౌన్సిలర్ వేముల నాగలక్ష్మి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్ పాల్గొన్నారు.

మల్యాల : మల్యాలలో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. సోనియా గుడి వద్ద కేకు కట్ చేసి, స్వీట్లను పంపిణీ చేశారు. సోనియా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, రాంలింగారెడ్డి, ఆదిరెడ్డి, శనిగారపు తిరుపతి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, సంజీవ్, ప్రతాప్, లక్ష్మారెడ్డి, సతీష్‌రెడ్డి, వినయ్, పాల్గొన్నారు.

మెట్‌పల్లి టౌన్ : పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం, పట్టణ కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ జన్మదిన వేడుకలను ఘనంగా జరిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, యూత్ అధ్యక్షులు జెట్టి లక్ష్మణ్, గంగాధర్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

మల్లాపూర్ : కాంగ్రెస్ అధినేత్ర సోనియాగాంధీ జన్మదిన వేడుకలను సోమవారం కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పలువురు నాయకులతో కలిసి ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. మల్లాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు.

బీర్‌పూర్: మండలంలో సోమవారం కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రమేష్, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మన్ రావ్, జితేందర్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుభాష్, జోగిరెడ్డి పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్ : మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు బర్కం చిట్టి, నబీ, రవీందర్‌రెడ్డి, రాసత్ పాషా, పిట్టల రమేష్, మధు పాల్గొన్నారు.

బుగ్గారం: మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు వేముల సుభాష్ ఆధ్వర్యంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో కేక్ కట్ చేసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యక్షుడు నగునూరి నర్స గౌడ్ పాల్గొన్నారు.

కథలాపూర్ : సోనియాగాంధీ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించారు. బస్టాండ్‌లో కేక్ కట్ చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, లింగం గౌడ్ ఉన్నారు.

మేడిపల్లి : సోనియా గాంధీ సన్మదిన వేడుకలను అ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి, టపాకాయలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి చలి నుంచి రక్షణకు షటర్లను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్ యాదవ్ పాల్గొన్నారు.

రాయికల్: కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక గాంధీ విగ్రహం వద్ద సోమవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు భూమరెడ్డి, మహిపాల్, మహేందర్‌గౌడ్, దివాకర్, రమేష్, భూమగౌడ్ ఉన్నారు.

జగిత్యాల అర్బన్ : కాంగ్రెస్ అగ్రనేత, రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను జగిత్యాల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఇందిరా భవన్‌లో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణి చేశారు.

గొల్లపల్లి : కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ జన్మదిన వేడుకలను గొల్లపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కేకు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముస్కు నిశాంత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, వైస్ చైర్మన్ రాజిరెడ్డి, కాంగ్రెస్ యూత్ మండల శాఖ అధ్యక్షుడు పురంశెట్టి గౌతమ్ రాజు, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు మహేష్, పాల్గొన్నారు.

వెల్గటూర్: సోనియా గాంధీ జన్మదిన వేడుకలు సోమవారం వెల్గటూర్‌లో ఘనంగా నిర్వహించారు. కేక్ కటింగ్ చేసి పండ్లు పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గోళ్ల తిరుపతి, మాజీ సర్పంచ్‌లు మురళి గౌడ్, బొప్ప తిరుపతి, మండల యూత్ అధ్యక్షుడు పూదరి రమేష్, గుండాటి సందీప్ రెడ్డి, పాల్గొన్నారు.

పెగడపల్లి : కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోని యా గాంధి జన్మదిన వేడుకలను సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ అధ్యక్షులు బుర్ర రాములుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు మల్లారెడ్డి పాల్గొన్నారు.

కొడిమ్యాల : మండల కేంద్రంలో సోమవారం సోనియా గాంధీ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు నారాయణగౌడ్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి ఉన్నారు.

కన్నుల పండువగా ఆరట్టు ఉత్సవం

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆరపేటలో అయ్యప్ప అరట్టు ఉత్సవం సోమవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక హన్‌మాన్ ఆలయం నుంచి పురవీధుల గుండా ఉత్సవమూర్తిని వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఆనంతరం శివాలయంలో చక్రస్నానం, అభిషేకం, నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వాముల భజన నృత్యాలు ఆకట్టుకు న్నాయి. ఈ కార్యక్రమంలో గురుస్వామి వెల్ది శ్రీకాంత్‌చారి, వెల్ది గంగయ్య, విక్రమ్, మ్యాదరపు మణితేజచారి, శివ, చిన్న గంగయ్య తదితరులు పాల్గొన్నారు.



అరట్టు ఉత్సవంలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

క్రమబద్ధీకరణ ఎన్నడో..?

(5వ పేజీ తరువాయి)

అదేవిధంగా మండల స్థాయిలో డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐసీ కో-ఆర్డినేటర్లు, ఐఈఆర్‌పీలు, మెసెంజర్లు, స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు, పాఠశాల స్థాయిలో పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు (ఆర్ట్, పీఈటీ, వర్క్ ఎడ్యుకేషన్), కేజీబీవీలు, అర్బన్ రెసిడెన్షియల్స్‌లలో స్పెషల్ ఆఫీసర్లు, పీజీ సీఆర్‌టీలు, సీఆర్‌టీలు, పీఈటీలు, ఏఎన్ఎంలు, అకౌంటెంట్లు, క్రాఫ్ట్ అండ్ కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు, కుక్స్, వాచ్‌వుమెన్‌లు, స్వీపర్లు, స్కావెంజర్లు పనిచేస్తున్నారు.

●ప్రధాన డిమాండ్‌లివీ..

రాష్ట్రంలో సమగ్ర శిక్ష పథకంలో పనిచేస్తున్న ఉద్యోగ లందరినీ విద్యా శాఖలో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలి, ఉద్యోగరీత్య ప్రమాదంలో మృతి చెందిన ఉద్యోగులకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి, ప్రతీ ఉద్యోగికి రూ. 10 లక్షల జీవిత బీమా, రూ. 5 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, రెగ్యులరైజ్ అమలు చేసే వరకు కనీసం మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేయాలని, విద్యాశాఖ నియామకాల్లో వేయిటేజీ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులకు బెనిఫిట్స్ కింద రూ. 10 లక్షలు, పీటీఐలకు 12 నెలల వేతనాలు చెల్లించాలన్న ప్రధాన డిమాండ్లు ఉన్నాయి. సెర్ప్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన విధంగానే సమగ్ర శిక్ష పథకం కాంట్రాక్టు ఉద్యోగులను సైతం రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా దాదాపు దశాబ్దన్నర క్రితం నియామకమైన తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో అమలు చేసిన అనియత విద్యా పథకంలో పనిచేసిన ఉద్యోగులు సైతం పలువురు సమగ్ర శిక్ష పథకంలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. దాదాపుగా పదవీ విరమణకు సమీపానికి వచ్చినప్పటికీ రెగ్యులరైజ్ కాకపోవడంతో మనస్తాపానికి గురవుతున్నారు.

సర్వీసులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలి

బర్ల నారాయణ, సీఆర్‌పీ, జేఏసీ జిల్లా అధ్యక్షుడు



ఏళ్ల తరబడి సమగ్ర శిక్ష విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగుల సర్వీసులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలి. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు విద్యాసేవలు అందిస్తూ ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తున్నాము. ఉద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని భావిస్తున్నాము. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోతే ఆందోళన ఉధృతం చేయక తప్పదు.

ప్రభుత్వం గుర్తించాలి

రవి, సీఆర్‌పీ, జగిత్యాల



సమగ్ర శిక్ష పథకం కింద పనిచేస్తున్న అందరు ఉద్యో గులను ప్రభుత్వం గుర్తించాలి. ఉద్యోగులు ఎంతో పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి. అవకాశం లేకపోతే కనీసం పేస్కేల్‌ను వర్తింప చేస్తే ఉద్యోగులకు కొంత ఊరట కలుగుతుంది. ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి.

ప్రజపాలన విజయోత్సవ ర్యాలీ

మల్లాపూర్, డిసెంబరు, 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాడి ఏడాది అవుతున్న సందర్భంగా మల్లాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, జలపతిరెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలి నుంచి భారతమాత చౌరస్తా వరకు జరిపిన భారీ ర్యాలీల్లో ఆయా గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎం కప్ 2024ను పకడ్బందీగా నిర్వహించాలి

స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి

జగిత్యాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన సీఎం కప్ 2024ను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో సీఎం కప్ 2024 సందర్భంగా జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడల నిర్వహణ గురించి అధికారులకు దిశ నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా యువజన మరియు క్రీడల అధికారి డాక్టర్ కోరుకంటి రవి కుమార్ జిల్లా అదనపు ఎస్పీ ఎం.బీ రావు, డీఈఓ రాము, పరిశ్రమల శాఖ ప్రతినిధి మధులత, మున్సిపల్ కమిషనర్ చిరంజీవి, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి లక్ష్మీరామ్, జిల్లా ఒలంపిక్ కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సోమవారం సీఎం కప్ పోటీలను ప్రధానోపాధ్యాయులు శ్రీసింగ్ సత్తయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయిలో రాణించాలన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరజనీకర్‌రెడ్డి, ఎండీ ఫక్రుద్దీన్, ఫిజికల్ డైరెక్టర్ కొండపల్కల కోటేశ్వర్‌రావు, పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం అందాలి

జగితాల్య డీఎస్పీ రఘుచందర్

రాయికల్, డిసెంబర్, 9 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందేలా చూడాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా రాయికల్ పోలీస్‌స్టేషన్‌ను సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డుల నిర్వాహణ, నేరాల నమోదు, సిబ్బంది పనితీరు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరతగతిన పరిష్కరించాలని, సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటుపై గ్రామస్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ సుధీర్ రావు, సిబ్బంది ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

సేంద్రియ ఎరువులతో మొక్కల సాగు అభినందనీయం

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : సేంద్రియ ఎరువులో మొక్కల సాగు అభినందనీయమని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ టి.మోహన్ అన్నారు. సోమవారం పట్టణంలోని 18వ వార్డుకు చెందిన చిటికేసి లాస్య-రంజిత్ దంపతులు ఇంట్లో వాడి పడేసిన ప్లాస్టిక్ డబ్బాలను వినియోగిస్తూ సేంద్రియ ఎరువుతో మిద్దె సాగులో పూల మొక్కలు, కూరగాయలు పెంచుతున్న విధానాన్ని పరిశీలించారు. పచ్చదనాన్ని పెంచుతూ పర్యావరణాన్ని కాపాడుతున్న వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్, సిబ్బంది ముజీబ్ పాల్గొన్నారు.

సమష్టిగా రైతు సమస్యలు పరిష్కరించుకోవాలి

భారతీయ కిసాన్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్, 9 (ఆంధ్రజ్యోతి) : భారతీయ కిసాన్ సంఘ ఆధ్వర్యంలో రైతులు సమష్టిగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకోవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేపూరి భాస్కర్ అన్నారు. సోమవారం మండలంలోని వెల్లుల్ల గ్రామంలో మండల అధ్యక్షుడు ముకుంద రాజేష్ నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్ప రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కాసారా బొమ్మ రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతీయ కిసన్ సంఘ గ్రామాధ్యక్షుడుగా సురకంటి రాజుకుమార్, ఉపాధ్యక్షుడుగా బడాల రాజాగంగారాం, ప్రధాన కార్యదర్శిగా ముకుంద నరేష్, కోశాధికారిగా గోపిడి అంజయ్యలను ఏకగ్రీవంగా నూతన కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. నూతన కమిటికి నియమాక పత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు మారు మురళీధర్‌రెడ్డి, అల్లూరి అనిల్‌రెడ్డి, క్యాతం చిరంజీవి, గోపిడి అంజయ్య, సార్ల మోహన్‌రెడ్డి, రాజారెడ్డి, సంజీవ్‌లు, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ పాఠశాలలో మండల జీవశాస్త్ర టాలెంట్ టెస్టును సోమవారం విద్యా శాఖ అధికారులు నిర్వహించారు. పాఠశాల ప్రదానోపాధ్యాయుడు కృష్ణమోహన్ రావు ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టు నిర్వహించారు. వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులకు మండల స్థాయి జీవశాస్త్ర పరీజ్ఞాన పరీక్షలో పాల్గొన్నారు. తెలుగు మీడియంలో పట్టణంలోని జిల్లా పరిషత్ చెందిన విద్యార్థి మేఘన మెదటి స్థానంలో నిలువగా రెండవ స్థానంలో శ్రావణి నిలిచినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఇంగ్లీష్ మీడియం విభాగంలో జిల్లా పరిషత్ జోగినిపల్లి పాఠశాలకు చెందిన అక్షయ మొదటి స్థానంలో నిలువగా రెండవ స్థానంలో మోహన్ రావుపేట జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన సాయి దీప్ రెండవ స్థానంలో నిలిచినట్లు వారు తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను మండల విద్యాధికారి నరేశం, బయెసైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు వీరబత్తిని రాజగోపాల్ అభినందించి ప్రశంస పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోగిల కృష్ణ, చౌల లక్ష్మినారా యణ, ప్రబాకర్, రమేష్, శాంత కుమారిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

కొడిమ్యాల : మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో సోమవారం బయో సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో బయో సైన్స్ టాలెంట్ పరీక్షలను ఎంఈవో ఎ. శ్రీనివాస్ సమక్షంలో నిర్వహించారు. ఈ టాలెంట్ పరీక్షలకు ఎ. లక్ష్మీనారాయణ కన్వీనర్‌గా వ్యవహరించారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలని నిరసన

కొడిమ్యాల, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అమలు చేయటం లేదని మండల కేంద్రంలో సోమవారం బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీకు చెందిన పలువురు నాయకులు అంబేద్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తామని వెల్లుతుండగా అనుమతి లేకుండా నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నారని పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం బీఆర్ఎస్, బీజేపీ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తలించి వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టులు



మెట్‌పల్లి పోలీసుల అదుపులో ఉన్న మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు

ధర్మపురి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చలో అసెంబ్లీ ముట్టడి సందర్భంగా ధర్మపురి మండల మాజీ సర్పంచులను సోమవారం ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. తమ ఇంటి వద్ద ఉన్న మాజీ సర్పంచులు కాళ్ల శేఖర్, కంది తిరుపతి, దత్తూరి నర్సయ్య, అల్వాల సురేష్‌ను ఇంటి వద్దకు వెళ్లి వారందరిని అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం వారందరిని వదిలి పెట్టారు.

పెగడపల్లి : చలో అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో పెగడపల్లి మండలంలోని మాజీ సర్పంచులను సోమ వారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం స్వంత పూచీకత్తుపై వదిలిపెట్టారు. అరెస్టయిన వారిలో సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు రాజేశ్వర్‌రావు, లక్ష్మణ్, శ్రీనివాస్, రవి, ఆనంద్, తిరుపతి ఉన్నారు.

మెట్‌పల్లి రూరల్ : ఐదేళ్ల పదవి కాలంలో సర్పంచులు, ప్రజాప్రతినిధులు గ్రామాలను అభివృద్ధి కోసం చేసిన పనుల పెండింగ్ బిల్లులను కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపులకు పాల్పడకుండా మంజూరు చేయాలని మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మెట్‌పల్లి పోలీసులు పలువురు మాజీ సర్పంచులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. మాజీ సర్పంచులు రాజారెడ్డి, శేఖర్‌రెడ్డి, ఉన్నారు.

కోరుట్ల రూరల్ : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లను సోమవారం పోలీసులు ముందస్తూ అదుపులోకి పోలీసులు తీసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ చలో అసెంబ్లీ కార్యక్రమంలో భాగంగా ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు మాజీ సర్పంచులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం విడుదల చేశారు. మాజీ సర్పంచ్‌లు దారిశెట్టి రాజేష్, భాస్కర్‌రెడ్డి, ఆంజయ్య శ్రీనివాస్, నర్సయ్య పాల్గొన్నారు.

వెల్గటూర్: చలో అసెంబ్లీ కార్యక్రమానికి తరలి వెళ్లనున్న మాజీ సర్పంచ్‌లను సోమవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. మాజీ సర్పంచ్‌లు రాంబాబు, రవి, నగేష్ ఉన్నారు.

కొడిమ్యాల : పలువురు మాజీ సర్పంచులను సోమవారం కొడిమ్యాల ఎస్సై సందీప్ ముందస్తుగా అరెస్ట్ చేశారు. మల్లేశంయాదవ్, స్వామిరెడ్డి, మల్లేశంము దిరాజు, మహిపాల్, రమేష్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మేళాకు ఎంపికైన విద్యార్థి

ధర్మపురి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండల కేంద్రంలో గల కేజీబీవీకి చెందిన 10వ తరగతి విద్యార్థి ప్రణయశ్రీ రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మేళాకు ఎంపిక అయ్యింది. సృజనాత్మకతను వెలికి తీసే ప్రయ త్నంలో భాగంగా ప్రభుత్వం విద్యా శాఖ సంయుక్తంగా జగిత్యాలలో రెండు రోజుల పాటు మేళా నిర్వహించింది. ఈ మేళాలో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డ్ మానక్ ప్రోగ్రాంలో ప్రణశ్రీ రూపొందించిన జీవ ఎరువులు తయారీ విధానం అనే అంశంపై ప్రదర్శన ఇచ్చింది. మేళాలు 65 ప్రదర్శనలకు గాను 7 ప్రదర్శనలు ఎంపిక కాగా ప్రణయశ్రీ ఒకరు ఉన్నారు. విద్యార్థి ప్రణయశ్రీని ఎంఈ వో సీతాలక్ష్మి, ప్రిన్సిపాల్ అరుణ, టీచర్ సరిత ప్రత్యేకంగా అభినందించారు.

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలి

కథలాపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ అశోక్ ఆధ్వ ర్యంలో ఈనెల 11న జిల్లా కేంద్రంలో ని ర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై నవీన్ ఒక ప్రకటనలో కోరారు. వివిధ కంపనీలు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్న నేపథ్యంలో అర్హతకు అవసరమైన ధృవ పత్రాలతో జాబ్ మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు.

దివ్యాంగులకు బహుమతుల పంపిణీ



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందిస్తున్న ఎంఈవో ప్రభాకర్

ధర్మపురి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ధర్మపురి మండల విద్యా వనరుల కేంద్రంలో దివ్యాంగులకు సోమవారం పాటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురి ఎంఈవో సీతాలక్ష్మి దివ్యాంగుల గురించి పిల్లల తల్లిదండ్రులకు చక్కని అవగాహన కల్పించారు. అనంతరం పాటల పోటీల్లో విజేతలుగా నిలిచిన దివ్యాంగులకు ఆమె బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ రాజారం హెచ్ఎం రావులపెల్లి వెంకటరమణ, ఆరెపల్లి హెచ్ఎం మదుకర్ రెడ్డి, దొంతాపూర్ హెచ్ఎం ప్రభాకర్, ఎంఎస్‌వో శంకరయ్య, గణేష్ పల్లె హెచ్ఎం మహేష్, ఐఈఆర్‌పీ స్వప్న, లక్ష్మి, సీఆర్‌పీలు సత్యనారాయణ, శ్రీనివాస్, రాజ్‌కుమార్, ఎంఐఎస్ వనిత, శోభ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెల్గటూర్: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో విద్యాశాఖ ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు ఐఈఆర్పీల ద్వారా ప్రత్యేక బోధన అందిస్తుందని మండల విద్యాధికారి బోనగిరి ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం వెల్గటూరు మండల విద్యా వనరుల కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలలో నమోదైన ప్రత్యేక అవసరాల చిన్నారులకు పలు రకాల ఆటల పోటీలు, సాంస్కృతిక పోటీలు నిర్వ హించి బహుమతులు ప్రధానం చేశారు. ఎంఈవో మాట్లాడుతూ దివ్యాంగులైన విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాల గురించి వివరించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు చిప్ప నందయ్య, పైడిపల్లి ప్రధాన ఉపాధ్యాయుడు మల్లయ్య, మండల పరిషత్ పర్య వేక్షకులు సూర్యారావు, సీనియర్ సహాయకులు ప్రసాద్, ఏపీవో అనిల్, పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు చింతపండు నర్సింగం, ఐఈఆర్ శ్రీలత, ఎంఐఎస్ కోఆర్డినేటర్ కవిత, సీఆర్పీలు వైద్య వెంకటేష్, రజని, సీసీవో శ్రీనివాస్, మెసెంజర్ చంద్రయ్య, పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కథలాపూర్ : మాజీ ఎంపీపీ జవ్వాజి రేవతి భర్త గణేశ్ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, వేములవాడ ఏఎంసీ మాజీ చైర్మన్ మనోహర్‌రెడ్డి పరామర్శించారు. భౌతిక కాయం వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

మల్లాపూర్ : తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ డిమాండ్‌ల సాధనలో భాగంగా ఈనెల 10 నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు వివరాలు తెలిపారు.

జగిత్యాల అర్బన్ : గుండెపోటుతో మరణించిన బుగ్గారం ఎంపీడీవో శ్రీనివాస్ మరణం ఉద్యోగులందరిని విస్మయానికి గురి చేసింది. ఆయన అకాల మరణం పట్ల స్థానిక రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో గెజిటెడ్ అధికారుల సంఘం, టీఎన్‌జీవో కార్యదర్శులు శ్రద్ధాంజలి ఘటించారు.

జగిత్యాల అర్బన్ : కాంగ్రెస్ ప్రభుత్వం నిజమైన కళాకారులను గుర్తించి సాంస్కృతిక సారధిలో ఉద్యోగాలు కల్పించాలని జిల్లా కళాకారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు తమ గళం వినిపిం చడానికి ఈ నెల 12, 13వ తేదీలలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హలో కళాకారులు చలో హైదరాబాద్ 32 గంటలు పాటల పల్లకిలో ఆల పాట దగా పడ్డ కళాకారుల దప్పులమోత కర్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉద్యమ కారుల ఫోరం జిల్లా అధ్యక్షులు జవ్వాజి శంకర్ తెలిపారు. ఉద్యమ కారుల సభ పోస్టర్‌ను జగిత్యాల మున్సిపల్ చైర్మన్ జ్యోతి ఆవిష్కరించారు.

బీర్‌పూర్: మండలంలోని తుంగూర్ గ్రామంలో ప్రారంభం కానున్న కస్తూర్బా పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఆయా పోస్టులలో పనుల కోసం మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నారు. బీర్‌పూర్ మండలంలోని ఆసక్తి గల మహిళలు 308 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు సోమవారం ఎంఈవో నాగభూషణం తెలిపారు.

బీర్‌పూర్: మండల కేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మండల స్థాయి సైన్స్ టాలెంట్ పోటీ పరీక్షలను నిర్వహించారు. ఇంగ్లీష్ మీడియం నుంచి తుంగూర్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థిని సువిష్ణ రాణి, జిల్లాపరిషత్ పాఠశాల బీర్‌పూర్‌కు చెందిన అమూల్యా, ప్రథమ ద్వితీయ స్థానాలలో నిలువగా, తెలుగు మీడియంలో జిల్లా పరిషత్ బీర్‌పూర్ పాఠశాలకు చెందిన లక్ష్మి, అదే పాఠశాలకు చెందిన పూజిత ప్రథమ ద్వితీయ స్థానాలలో నిలిచారు.